సాక్షి
వికారాబాద్

సోమవారం । 11 । మార్చి । 2024



లక్ష్యం మరిచారు!
పెద్దేముల్‌లో నూతనంగా నిర్మించిన బస్టాండ్‌లో బస్సులు నిలపకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



సమస్యలు పరిష్కరించాలి
ఆర్‌ఎంపీ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 8లో▸



ఉల్లిసాగు.. భలేబాగు
ఉల్లిగడ్డకు మెరుగైన మద్దతు ధర పలుకుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

మహిళా సాధికారతే లక్ష్యం



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నాయకులు

అనంతగిరి: మహిళా సాధికారత కోసం అల్‌ఖైరా, జమాతే ఇస్లామి హింద్ తోడ్పాటునందిస్తుందని వికారాబాద్ మైనార్టీ నాయకులు తస్వర్ అలీ అన్నారు. వికారాబాద్‌లోని జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో శిక్షణ పొందిన 45మంది మహిళలకు ఆదివారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. తస్వర్‌అలీ మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధితో అభివృద్ధి సాధించాలన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న ప్రోత్సాహంతో ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ వికారాబాద్ అధ్యక్షుడు మహ్మద్ ఫయాజ్, ఎస్‌ఐఓ వికారాబాద్ అధ్యక్షుడు అఫ్సాన్, ప్రతినిధులు జాకీర్, శిక్షణ పొందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పురుషులతో సమానంగా రాణించాలి

- కౌన్సిలర్ నీరజ
- ఐకాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు కైవసం



తాండూరు టౌన్: తాండూరు మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ నీరజా బాల్‌రెడ్డికి ఐకాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కళాకార్ తెలుగు టీవీ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు హైదరాబాద్‌లో అవార్డులు అందజేశారు. ఈ క్రమంలో రాజకీయ రంగంలో తనదైన ముద్ర వేస్తూ, ప్రజా సమస్యలపై కౌన్సిల్‌లో గళమెత్తి అందరి మన్ననలు పొందిన నీరజా బాల్‌రెడ్డికి నిర్వాహకులు అవార్డు అందజేశారు. నీరజ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై తాను చేస్తున్న పోరాటాన్ని గుర్తించి అవార్డు ప్రదానం చేసిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. రాజకీయాల్లో పురుషులకు సమానంగా మహిళలు రాణించాలనేదే తన ధ్యేయమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత ఉత్సాహంతో పనిచేస్తానన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న పీఎన్ శర్మ

తుర్కయంజాల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని చీఫ్ కంట్రోలర్ ఆఫ్ మైన్స్ (ఇన్‌చార్జి), ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ పీఎస్ శర్మ అన్నారు. తుర్కయంజాల్‌లోని వీఎంఆర్ గార్డెన్స్‌లో ఓ సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన మైన్స్ ఎన్విరాన్‌మెంట్ అండ్ మినరల్ కన్జర్వేషన్ కౌన్సిల్ 29వ వారోత్సవాల ముగింపు, అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ప్రకృతికి విరుద్ధంగా పనులు చేపట్టకూడదని, దానిని కాపాడుకుంటూ మైనింగ్ చేపట్టాలని సూచించారు. మైనింగ్ చేపట్టే ప్రాంతాలకు దగ్గర్లో ఉన్న ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని 104 గనులను పరిశీలించినట్టు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, ఖనిజ సంరక్షణ రంగంలో విశేష కృషి చేసినందుకు గాను ఉద్యోగులకు పర్యావరణ్ బంధు, మినరల్ కన్జర్వేషన్ బంధు అవార్డులను అందజేశారు. మైన్స్ కంట్రోలర్ జయకృష్ణ బాబు, రీజినల్ కంట్రోలర్ ఆఫ్ మైన్స్ డోంగ్రే పాల్గొన్నారు.

మాలెపల్లి గ్రామాన్ని సందర్శించిన డీపీఓ

ఆమనగల్లు: మండల పరిధిలోని మాలెపల్లి గ్రామాన్ని ఆదివారం జిల్లా పంచాయతీ అధికారి వి.సురేశ్‌మోహన్ సందర్శించారు. గ్రామంలో నిర్మించిన డంపింగ్‌యార్డు, శ్మశాన వాటిక, నర్సరీ, పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీలత, స్థానికులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ ఏదీ?

మీరు క్రమం తప్పకుండా హోటళ్లలో తింటున్నారా.. అయితే అంతే సంగతి.. ఫుడ్ పాయిజన్ అయి ఆస్పత్రిలో చేరక తప్పదు. ఇటీవలి కాలంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదవుతున్న కేసులే ఇందుకు నిదర్శనం. ఎలాంటి సేఫ్టీ మెజర్స్ పాటించకుండా ఫ్రిజ్‌లో నిల్వచేసిన పదార్థాలతో మెజార్టీ హోటళ్లలో వంటకాలు వండుతున్నట్లు సమాచారం. దీనికి తోడు రోడ్ల వెంబడి ఉండే బండ్లపై (స్ట్రీట్ ఫుడ్) వండే పదార్థాలను తిని ప్రజలు రోగాలపాలవుతున్నారు. ఫుడ్ అండ్ సెఫ్టీ అధికారులు కానీ మున్సిపల్, రెవెన్యూ అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

ఆహార భద్రతా నియమాలు పాటించని హోటళ్లు
- కుళ్లిన పదార్థాలతో వంటకాలు
- పెరుగుతున్న ఫుడ్ పాయిజన్ కేసులు
- కొరవడిన అధికారుల తనిఖీలు





తాండూరు బస్‌స్టేషన్ సమీపంలోని హోటళ్లు, (ఇన్‌సెట్‌లో) కుళ్లిన మాంసం (ఫైల్)

తాండూరు: జిల్లాలోనే పారిశ్రామిక పట్టణంగా పేరున్న తాండూరు కాలుష్యభరితంగా మారింది. ఇక్కడి గాలితో పాటు ఆహార పదార్థాలు సైతం ప్రమాదకరంగా మారుతున్నాయి. వ్యాపారపరంగా ప్రతిరోజు వేల సంఖ్యలో ప్రజలు ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. వచ్చిన వారు తాండూరు ప్రాంతంలోని ఏదో ఒక హోటల్‌లో కడుపు నింపుకోవాలి. అయితే హోటల్ నిర్వాహకులు ఎలాంటి ఆహార భద్రత చర్యలు చేపట్టకుండా నాసిరకం వంటకాలను కస్టమర్‌లకు అందిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఎంతోమంది ఫుడ్ పాయిజన్ బారిన పడి అనారోగ్యానికి గురవుతున్నారు. తాండూరు పట్టణంలోని బస్ స్టేషన్, రైల్వే స్టేషన్ ప్రాంతాలతో పాటు ప్రధాన కూడళ్లలో ఉన్న హోటళ్లలో కలుషిత ఆహారం అందించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. గతంలో మున్సిపల్ అధికారులు హోటళ్లను తనిఖీ చేయగా కుళ్లిన పదార్థాలతో పాటు పురుగు పట్టిన చికెన్, మాంసాహారాన్ని గుర్తించారు. అప్పట్లో పలు హోటల్‌లను సీజ్ చేశారు. టిఫిన్ సెంటర్‌లు, చాట్ భండార్‌లలో సైతం నాణ్యమైన పదార్థాలను అందించడం లేదనే విమర్శలున్నాయి.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీ..

జిల్లాలో ఆహార నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు జిల్లాకు ఫుడ్ సెఫ్టీ అధికారి ఉండాలి. అయితే జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఫుడ్ సెఫ్టీ అధికారిని నియమించలేదు. దీంతో తాండూరు మున్సిపల్ అధికారులే హోటళ్లను తనిఖీ చేసి నామ మాత్రం చర్యలు తీసుకుంటున్నారు. అయితే నాలుగేళ్లుగా మున్సిపల్ అధికారులు కూడా హోటళ్లను తనిఖీ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఫుడ్ పాయిజన్ కేసులు..

తాండూరు ప్రాంతంలో కలుషిత ఆహారం తిని ఫుడ్ పాయిజన్ కేసుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. తాండూరు ప్రాంతంలో ఎక్కడ పడితే అక్కడ హోటల్‌లు, టిఫిన్ సెంటర్లు వెలుస్తున్నాయి. ప్రధానంగా రోడ్డుపక్కనే టిఫిన్ సెంటర్‌లు, హోటళ్లు ఉండటంతో దుమ్ము, ధూళికి ఆహార పదార్థాలు కలుషితమవుతున్నాయి.

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం



తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బదిలీపై వచ్చాను. మున్సిపల్ కార్యాలయంలో పాలనా వ్యవహారాలను సరిదిద్దుకోవడంతో సమయం గడిచింది. రెండు మూడు రోజుల్లో హోటళ్లపై, టిఫిన్ సెంటర్‌లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. నిభంధనలను పాటించని హోటళ్లను సీజ్ చేస్తాం.

– విక్రమ్‌సింహారెడ్డి, కమిషనర్, తాండూరు మున్సిపాలిటీ



సమావేశంలో మాట్లాడుతున్న సునీతారెడ్డి

యువ ఓటర్లపై దృష్టి సారించండి

జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

అనంతగిరి: యూత్ కాంగ్రెస్ నాయకత్వం పార్టీకి వెన్నెముకలాంటిదని జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. వికారాబాద్ పట్టణంలోని సత్య భారతి గార్డెన్‌లో ఆదివారం యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సునీతారెడ్డి మాట్లాడుతూ.. సీఎంలుగా, మంత్రులుగా, ఎంపీలుగా పని చేసిన చాలామంది పెద్ద నాయకులు యూత్ కాంగ్రెస్ నుంచే రాజకీయ జీవితాన్ని ప్రారంభించారన్నారు. పట్నం మహేందర్ రెడ్డి యువకుడిగా ఉన్నప్పటి నుంచి రాజకీయాల్లో ఉండి రెండుసార్లు మంత్రి అయ్యారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి యువనాయకులు చాలా అవసరమని.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ పాత్ర కీలకమని అన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులకు అండగా ఉంటామన్నారు. చేవెళ్ల ఎంపీ స్థానాన్ని హస్తం పార్టీ కైవసం చేసుకుంటుందన్నారు. పీసీసీ జనరల్ సెక్రటరీ రఘువీరా రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు పోతున్నామని అన్నారు. వికారాబాద్ జిల్లా నుంచి భారీ మెజార్టీ ఇచ్చేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీష్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అసంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు సంతోష్ గౌడ్, మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు రాములు, రమేష్ కుమార్, సంతోష్, కృష్ణం రాజు, ఆయా మండలాల యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను బొంద పెట్టాలని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 35 మంది వివిధ పార్టీల నాయకులు ఆదివారం కొండా సమక్షంలో బీజేపీలో చేరారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చేవెళ్ల లోక్‌సభ స్థానం ప్రధాని మోదీకి బహుమతిగా ఇద్దామన్నారు.. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ మండల అధ్యక్షుడు కిరణ్, రాము, కుతురు మహేందర్, కృష్ణ, రాజీవ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, జగదీశ్‌గౌడ్, రవిగౌడ్, జనార్దన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగోడుతండాలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న డీఈఈ వెంకటరావు

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- నాసిరకం రోడ్లు వేస్తే బిల్లులు నిలిపివేస్తాం
- పంచాయతీ రాజ్ డీఈఈ వెంకటరావు

పెద్దేముల్: సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ డీఈఈ వెంకటరావు అన్నారు. పెద్దేముల్ మండలంలోని ఎర్రగోడుతండా, ఆత్కూర్ గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పెద్దేముల్ మండలంలోని 37 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం సీసీ రోడ్లతో పాటు డ్రైనేజీలకు సుమారు రూ.3 కోట్ల వరకు నిధులు మంజురు చేసిందన్నారు. మొత్తం 53 పనుల్లో 42 సీసీ రోడ్లు, 11 సైడ్ డ్రైనేజీలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతం గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు ప్రారంభం కాగా డ్రైనేజీ పనులు త్వరలో ప్రారంభం అవుతాయన్నారు. సీసీ రోడ్ల నిర్మాణాలకు ఇసుకను రూ.600కే ట్రాక్టర్ అందజేయడం జరుగుతుందన్నారు. సీసీ రోడ్లకు మంజూరైన ఇసుకను పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవన్నారు. పనులు నాసిరకంగా చేపడితే బిల్లులు నిలిపివేస్తామని స్పష్టం చేశారు. మండలంలో సీసీ రోడ్ల పనులు జోరుగా సాగుతున్నా పెద్దేముల్ పంచాయతీ రాజ్ ఏఈఈ సిద్దార్థ ఏ గ్రామంలో కూడా కనబడరని, పనులు పూర్తయిన తర్వాత మాత్రం గ్రామాలకు వచ్చి రికార్డులు చూసుకొని వెళ్లిపోతారని స్థానికులు డీఈఈకి ఫిర్యాదు చేశారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సిబ్బంది తప్పకుండా ఉండేలా చూస్తామని డీఈఈ తెలిపారు.

దుబ్బకుంట.. కబ్జాదారుల కంట

- కట్టను చెరిపేసి.. ప్లాట్లుగా మార్చేసి..
- ఓ రియల్ వ్యాపారి ఆక్రమణ పర్వం
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి
- లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరిక



కట్ట ధ్వంసం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో చెరువులు, కుంటల అన్యాక్రాంతానికి అడ్డుకట్ట పడడం లేదు. వీటిని రక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. తుర్కయంజాల్ పాత గ్రామానికి ఆనుకుని దుబ్బ కుంట ఉంది. ఎన్నో ఎళ్లుగా ఉన్న ఈ కుంటపై ఓ బడా రియల్ వ్యాపారి కళ్లు పడ్డాయి. ఇంకేముంది కట్టను చెరిపేసి ప్లాట్లుగా మార్చే ప్రక్రియను రెండు, మూడు రోజులుగా వేగవంతం చేశాడు. 15 ఏళ్ల క్రితం ఇలాగే ప్లాట్లుగా మార్చడానికి ప్రయత్నించగా స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో వెనకడుగు వేశాడు. ప్రస్తుతం అక్కడ భూమి ధర గజం రూ.40వేల వరకు పలుకుతుండటంతో మరోసారి దీన్ని కాజేయాలని కుట్ర పన్నారు. ప్రభుత్వ సర్వే నంబర్ 631తో పాటు, పట్టా సర్వే నంబర్ 612లో ఈ కుంట విస్తరించి ఉంది. సుమారు 30 గుంటల విస్తీర్ణంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న ఈ కుంట కట్టను జేసీబీల సాయంతో తవ్వించి, చదును చేసి హద్దు రాళ్లను నాటారు. అయినా ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడ లేదు. కళ్ల ముందే కుంట అన్యాక్రాంతం అవుతుంటే బాధగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కుంటను కాపాడి, ఆక్రమణకు యత్నిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారులు స్పందించని పక్షంలో సోమవారం నుంచే ఆందోళన చేపట్టాలని నిర్ణయించినట్లు 'సాక్షి'కి తెలిపారు.



పోటీలో తలపడుతున్న పహిల్వాన్‌లు



ప్రత్యర్థిని మట్టి కరిపించిన పహిల్వాన్

కుస్తీ మే సవాల్

ముగిసిన మహాలింగేశ్వర ఆలయ ఉత్సవాలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కుస్తీ పోటీలు
- హోరాహోరీగా తలపడిన పహిల్వాన్‌లు
- విజేతగా నిలిచిన కర్ణాటక యువకుడు శ్రీకాంత్ కాంబ్లే

బషీరాబాద్: బషీరాబాద్ మండలం జీవన్గీ మహాదేవలింగేశ్వర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన అంతర్రాష్ట్ర కుస్తీపోటీలు జాతీయ స్థాయి రెజ్లర్ పోటీలను తలపించాయి. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తరలివచ్చిన పహిల్వాన్‌లు మల్లయుద్ధంలో భీకర పోరాటం చేశారు. సుమారు120 జట్లు ఈ పోటీల్లో తలపడ్డాయి. ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేస్తూ జాతీయ స్థాయి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పదేళ్ల బాలుడు మొదలుకొని నలభై ఏళ్ల యువకుల వరకు పాల్గొన్న ఈ పోటీల్లో ఫైనల్ పోరులో శ్రీకాంత్ కాంబ్లే, మహేష్ తలపడగా



విజేత శ్రీకాంత్‌ను సన్మానించిన అతిథులు

శ్రీకాంత్ దుబే విజేతగా నిలిచాడు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ అశోక్, ఎస్‌ఐలు రమేష్, గిరి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ విజేతలను ఘనంగా సన్మానించారు. ఆదివారంతో మహాలింగేశ్వర ఆలయ ఉత్సవాలు ముగిశాయి. అంతకుముందు వేలంపాటలో స్వామివారి కలశంను గ్రామానికి చెందిన భీంరెడ్డి రూ.85,100కు సొంతం చేసుకున్నాడు. భక్తులకు అన్నదానం చేశారు.

గెలిపిస్తే లోక్‌సభలో వాణి వినిపిస్తా

సీడబ్ల్యూసీ సభ్యుడు, మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి

షాద్‌నగర్: పాలమూరు ప్రజా గొంతును లోక్‌సభలో వినిపిస్తానని సీడబ్ల్యూసీ సభ్యుడు, మహబూబ్‌నగర్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. షాదనగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేల ఆశీస్సులతో అధిష్టానం తనకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించిందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైతే నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషి చేసి పార్టీకి విజయాన్ని అందించారో అదే విధంగా లోక్‌సభ ఎన్నికల్లోనూ రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసే నేత చల్లా వంశీచందర్‌రెడ్డి అని అన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

వివిధ పార్టీల నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, నాయకులు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, బాబర్‌ఖాన్, కొంకళ్ల చెన్నయ్య, బాల్‌రాజ్‌గౌడ్, రఘు, హరినాథ్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, కృష్ణారెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకంతో పేదలకు మేలు

ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప

పహాడీషరీఫ్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకం పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప అన్నారు. మామిడిపల్లి రంగనాయకుల కాలనీలో మాజీ కౌన్సిలర్ ఈరంకి వేణు కుమార్ గౌడ్ అధ్యక్షతన ఆదివారం ఓబీసీ మోర్చా జిల్లా స్థాయి సమ్మేళనం నిర్వహించారు. ఈశ్వరప్ప మాట్లాడుతూ.. వెనుకబడిన కులాల వారి కోసం ప్రధాని నరేంద్ర మోదీ విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తూ పేదలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దద్దుల లక్ష్మీనారాయణ, సోషల్ మీడియా రాష్ట్ర ఇన్‌చార్జి సార కుమార్, జిల్లా కార్యాలయ ఇన్‌చార్జి వేణు గౌడ్, జిల్లా అధికార ప్రతినిధులు నరసింహా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మైపాల్ ముదిరాజ్



కుల్కచర్ల: భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడిగా కుల్కచర్ల గ్రామానికి చెందిన గాదె మైపాల్ ముదిరాజ్ నియమితుల య్యారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ.. ఇప్పటివరకు బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన తనకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. అదే విధంగా జిల్లా కార్యవర్గసభ్యుడిగా నూతనంగా బాధ్యతలు అప్పగించినందుకు జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకం ఉంచి ఇచ్చిన పదవిని బాధ్యతాయుతంగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

తండాల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

కుల్కచర్ల: గిరిజన తండాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని అఖిల భారత బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాహుల్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని హన్మ్యానాయక్ తండా గ్రామ పంచాయతీ హీర్యానాయక్ తండాలో నూతనంగా వేసిన సీసీరోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగా ముందస్తుగా గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి పనులను కేటాయించారన్నారు. కార్యక్రమంలో చందర్, స్థానిక యువకులు తదితరులు పాల్గొన్నారు.

పాన్ షాపులపై దాడులు



హుక్కా పదార్థాలను సీజ్ చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

అనంతగిరి: ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇంచార్జి ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ పక్కా సమాచారంతో పట్టణంలోని పాన్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. కాగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి పక్కన ఉన్న ఓ పాన్ దుకాణంలో తనిఖీలు నిర్వహించగా నిషేధిత హుక్కా సంబంధిత పదార్థాలు బయట పడ్డాయి. దాదాపు రూ.8,950 విలువ చేసే సరుకులను సీజ్ చేసి పట్టణ పోలీసులకు అప్పగించారు. నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఎమ్మెల్యే రంగారెడ్డితో కాలనీవాసులు

తుర్కయంజాల్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని వెంకటేశ్వర కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఆదివారం కాలనీవాసులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులకు వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధన్‌రాజ్ గౌడ్, ఓబీసీ జాతీయ యువజన సంఘం ఉపాధ్యక్షుడు నరేష్, కాలనీ అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, కాలనీవాసులు పాండు, హరినాయక్ పాల్గొన్నారు.



బస్టాండ్‌లో చేపడుతున్న మరమ్మతులు



బస్టాండ్‌లో నిర్మిస్తున్న నీటి సంపు

లక్షలు ధారపోశారు.. లక్ష్యం మరిచారు!

రూ.లక్షలు ఖర్చుచేసి బస్టాండ్‌ను నిర్మించారు. కానీ లక్ష్యం మరిచారు. ఆర్టీసీ అధికారుల అలసత్వానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతుల పేరుతో అధిక నిధులు వెచ్చించి ఆధునిక హంగులు అద్దుతున్నారు. బస్సులే రాని బస్టాండ్‌కు సొబగులు ఎందుకని స్థానికులు ఆరోపిస్తున్నారు.

బస్టాండ్‌లో నిలపని బస్సులు

- మరమ్మతుల పేరుతో భారీగా ఖర్చు
- తీవ్ర ఇక్కట్లు పడుతున్న ప్రయాణికులు

పెద్దేముల్: పెద్దేముల్‌లో నూతనంగా నిర్మించిన బస్టాండ్‌లో బస్సులు నిలపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామం మధ్యలో ఉన్న పాత బస్టాండ్‌లో మాత్రమే బస్సులు నిలిపి కొత్త ప్రాంగణాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో బస్సులు రాని బస్టాండ్‌కు మరమ్మతులు ఎందుకని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో బస్టాండ్ మరమ్మతుకు దాదాపు రూ.12–15 లక్షల వరకు నిధులు మంజూరు చేశారు. దీంతో సీసీ రోడ్డుతో పాటు ఓ పక్కన ప్రహరీ గోడను నిర్మించారు. తప్పకుండా బస్సులు నిలిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటామన్నారు. వారంరోజుల పాటు హోంగార్డును పెట్టి బస్సులు ఆగేలా చూశారు. అనంతరం హోంగార్డును నిలిపివేయడంతో బస్సులు యథావిధిగా రావడం లేదు. ఈ విషయాన్ని మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అయినా లాభం లేకుండా పోయింది. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో బస్టాండ్‌లో నీటి సంపుతోపాటు మరమ్మతులకు సుమారు రూ.లక్షన్నర పైగా నిధులు ఖర్చు చేస్తున్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలుపుతున్నారు.

జనావాసాలు పెరిగాయి

ఆర్టీసీ అధికారులు ప్రాంగణంలోకి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. నూతనంగా నిర్మించిన బస్టాండ్ గతంలో గ్రామానికి దూరంగా ఉండటంతో ప్రయాణికులు తక్కువగా వచ్చేవారు. ప్రస్తుతం దీని చుట్టూ ప్రభుత్వ కార్యాలయాలు, జూనియర్ కళాశాల భవనంతో పాటు జనావాసాలు భారీగా పెరిగాయి. బస్సులలో ప్రయాణం చేసే వారు సైతం అధికంగానే ఉన్నారు. వారికి ఈ కేంద్రమే అనువైనది. రాత్రి వేళల్లో లైట్లు లేక బస్టాండ్ అంధకారంలో ఉంది. దీంతో తాగుబోతులకు అడ్డాలుగా మారుతున్నందున లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అభ్యర్థిస్తున్నారు.

లైట్లు లేక తిప్పలు



పెద్దేముల్ నూతన బస్టాండ్‌లో లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. అలాగే గతంలో బస్సులను ఆపుతామని హామీ ఇచ్చిన ఆర్టీసీ అధికారులు ప్రస్తుతం పట్టించుకోవడం లేదు. జనాభా పెరగటంతో ప్రతి బస్సు బస్టాండ్‌లో నిలిపేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్, పెద్దేముల్

వసతులు కల్పించాలి



నూతన బస్టాండ్‌లో ఆర్టీసీ శాఖ అధికారులు ప్రయాణికులకు తగ్గట్టుగా వసతులు కల్పించాలి. ప్రతి బస్సు బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి. తాండూరు డిపోతో పాటు వికారాబాద్, సంగారెడ్డి బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలి.

– రాంరెడ్డి, రైతు, గిర్మాపూర్

చర్యలు తీసుకుంటాం



తాండూరు–సంగారెడ్డి ప్రధాన రహదారిపై వచ్చే బస్సులను పెద్దేముల్ నూతన బస్టాండ్‌లో నిలిపేలా చర్యలు తీసుకుంటాం. అందుకు ఆదేశాలు జారీ చేస్తాం. చెప్పినా వినకపోతే వారి వేతనం కట్ చేస్తాం. ఇందుకు ప్రయాణికులు, గ్రామ ప్రజల సహకారం కావాలి.

– సమత, ఆర్టీసీ డీఎం, తాండూరు

రథోత్సవం.. భక్తి పరవశం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పరిగి: మండల పరిధిలోని కంకల్ వీరభద్రేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా ఆదివారం రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. రాకంచర్ల పీఠాధిపతులు వెంకటదాసుల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిపించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో వీధుల గుండా రథాన్ని ఊరేగించారు. పరిసరాలన్నీ శివనామస్మరణతో మారుమోగాయి. భజన మండలి ఆధ్వర్యంలో స్వామి కీర్తనలు, భజనలు ఆకర్షించాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం పార్వతీపరమేశ్వరుల కల్యాణం ఉంటుందని ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పూడూరు పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ సభ్యురాలు మేఘమాల, నాయకులు నర్సింలు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పేదల సంక్షేమానికి నిరంతరం కృషి

మాజీ మంత్రి హరీశ్‌రావు

షాబాద్: పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో షాబాద్ మండలం మాచన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ కార్యదర్శి జైపాల్ తన పుట్టినరోజు సందర్భంగా హరీశ్‌రావును కలిసి బొకే అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ... పేద ప్రజల అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ అభివృద్ధి కోసం తపిస్తున్న జైపాల్‌ను అభినందించారు. ప్రజలతో మమేకమవడంలో ఉన్న ఆనందం ఎంతో గొప్పదన్నారు.



హరీశ్‌రావుకు మొక్కను అందజేస్తున్న జైపాల్

అనంతపద్మనాభస్వామి సన్నిధిలో వంశీచంద్‌రెడ్డి

కొత్తూరు: సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి దంపతులు ఆదివారం మండలంలోని పెంజర్ల గ్రామంలోని అనంతపద్మనాభస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ అనితారెడ్డితో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, వేదపండితులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్‌కు అతి చేరువలో ఉన్న ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు మామిడి సిద్దార్థరెడ్డి, ప్రభాకర్, హరినాథ్‌రెడ్డి, మహేందర్, దయానంద్ గుప్తా, సుధాకర్, రమేష్, సురేష్‌గౌడ్, రవికుమార్ గుప్తా పాల్గొన్నారు.



పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

సైబర్ నేరాలతో అప్రమత్తత

మోకిల ఎస్సై కోటేశ్వర్ రావు

శంకర్‌పల్లి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోకిల ఎస్సై కోటేశ్వర్ రావు పేర్కొన్నారు. కొండకల్ గ్రామంలో ఆదివారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరాల బారిన పడి ఎంతో మంది అభాగ్యులు అప్పుల పాలు కావడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ నేరగాళ్లు అపరిచితమైన నంబర్లతో లింక్‌లు పంపుతారని, వాటిపై క్లిక్ చేయకూడదని తెలిపారు. వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే నంబర్ల లింక్‌లపై కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత

యాచారం: మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లిలో ఆదివారం సాయంత్రం యాచారం పోలీసులు వాహనాలు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో యాదగిరి అనే వ్యక్తి అక్రమంగా ఆటోలో రెండు క్వింటాళ్ల రేషన్‌బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. అలాగే, అదే గ్రామంలో శంకర్ అనే వ్యక్తి ఇంట్లో రూ. 2వేలవిలువైన అక్రమ మద్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్‌లు

శంకర్‌పల్లి: రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ, శంకర్‌పల్లి పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బుల్కాపురం శివారుల్లోని రఘురాం ఫామ్ హౌజ్‌లో పేకాట ఆడుతున్న 14మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారి నుంచి రూ.1,24,260 నగదు, 13సెల్ ఫోన్‌లను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు రండి

ఆమనగల్లు: మండలంలోని పోలెపల్లిలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఈనెల 20న నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ ఎంపీ రాములును ఆహ్వానించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో పోలెపల్లి గ్రామానికి చెందిన పలువురు ఆలయ నిర్వాహకులు రాములును కలిసి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఒగ్గు లాలయ్య, నిర్వాహకులు దశరథం, కృష్ణయ్య, వెంకటయ్య, శివ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌ఎంపీ వైద్యులు

పరిగి: ఆర్‌ఎంపీ వైద్యుల సమస్యల పరిష్కారానికి తాను నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని నిర్వహించిన ఆర్‌ఎంపీ(రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్) వైద్యుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని వర్గాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. ఆర్‌ఎంపీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. సంఘం సమష్టిగా ఉంటేనే సమస్యలు తొందరగా పరిష్కారం అవుతాయన్నారు. సంఘ బలోపేతానికి సభ్యులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి



మున్సిపల్ సిబ్బందిని సన్మానిస్తున్న చైర్‌పర్సన్ మంజుల

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని, పట్టణాన్ని ఎప్పుడూ శుభ్రంగా ఉంచడంలో వారి పాత్ర ఎంతో కీలకమని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ అన్నారు. ఆదివారం బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రామ మందిరంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పట్టణాన్ని అందంగా ఉంచడానికి పారిశుద్ధ్య కార్మికులు ఉదయం 4గంటలకే విధుల్లో చేరి తెల్లారే సరికి శుభ్రంగా చేస్తానన్నారు. అలాంటి కార్మికులను ఎన్నిసార్లు సన్మానించినా తక్కువేనన్నారు. అనంతరం బ్రహ్మకుమారీస్ మధు అక్కయ్య మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులను ఏ మాత్రం తక్కువ చూడకూడదని హితవు పలికారు. వారు చేస్తున్న పనితో వేల మంది ఆరోగ్యంగా ఉంటున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరం బాధ్యతగా వ్యర్థాలను మున్సిపల్ ఆటోలో వేసి కార్మికులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఏసు, జవాన్లు వినోద్, చిన్నయ్య, రాజు, ఆశయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



మల్లన్న జాతరలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ మల్లన్న జాతరలో బండలాగుడు పోటీలనుఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవభక్తి అలవర్చుకోవాలన్నారు. మనిషి మనిషిలా బతకడం నేర్పేదే భగద్గీత అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మండల అధ్యక్షుడు కిరణ్, బీజేపీ నాయకులు రాము, కూతురు మహేందర్, కృష్ణ, పొన్న రాజీవ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, జగదీశ్‌గౌడ్, రవిగౌడ్, జనార్దన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, క్యామ నారాయణ, నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ జయమ్మ వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు లింగం, సులోచన, శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్, తదితరులున్నారు.



పూజలు చేస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

వరకట్న వేధింపులకు వివాహిత ఆత్మహత్య

మొయినాబాద్: వరకట్నం వేధింపులు తాళలేక వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిలుకూరు రాజీవ్ గృహకల్ప క్వాటర్స్‌లో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్‌కు చెందిన లావణ్య(18)ని, సంగారెడ్డి జిల్లా చెర్లగూడెంకు చెందిన పందిగోటి రవి(22)కు ఇచ్చి ఐదు నెలల క్రితం పెళ్లి చేశారు. జీహెచ్‌ఎంసీలో ఆటోడ్రైవర్‌గా పనిచేసే రవి మొయినాబాద్ మండలంలోని చిలుకూరులో ఉన్న రాజీవ్ గృహకల్ప క్వాటర్స్‌లో భార్యతో కలిసి ఉంటున్నాడు. పెళ్లైన నాలుగు నెలల పాటు బాగానే ఉన్న రవి నెల రోజుల నుంచి చిన్న చిన్న విషయాలకు భార్యతో గొడవపడి ఆమెను కొడుతున్నాడు. పెళ్లి సమయంలో కట్నం ఇవ్వలేదని.. కట్నం తీసుకురావాలని భార్యను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడు. ఆదివారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో రవి తన అత్తగారు భీమమ్మకు ఫోన్ చేసి మీ కూతురు నాతో గొడవ పడిందని చెప్పాడు. ఉ.9 గంటల సమయంలో భీమమ్మ చెల్లెలు ఎల్లమ్మ వచ్చి చూసేసరికి లావణ్య ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడుతూ కనిపించింది. దగ్గరకు వెళ్లి చూసేసరికి అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలు తల్లి భీమమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.



ఫొటోకు ఫోజులిస్తున్న పర్యాటకులు

కోట్‌పల్లి.. పర్యాటకులు కదిలి

కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి ఎక్కువైంది. మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా ఆదివారం వరుస కట్టారు. యువతీయువకులు వివిధ వాహనాల్లో ప్రాజెక్టుకు చేరుకుని బోటింగ్ చేసి ఫొటోలకు ఫోజులిచ్చారు. సాయంత్రం వరకు సరదాకు గడిపి సేద తీరారు.

– ధారూరు